శిస్తున్నారు. ముసలివాళ్ళు. పిండారీల దౌర్జన్యాలకు గురియైనవాళ్లు కావచ్చును. మొదట వచ్చిన స్త్రీ అన్నది: "బాబూ! కుంఫిణీరాజ్యం అంటే ఏమిటో అర్థమైంది. పూర్వం సైనికుల్ని చూస్తే పై ప్రాణాలు పైనే పోయేవి. ఇప్పుడు వాళ్లే గ్రామస్థుల్ని విందులకు కూడా పిలవడం ఎంత అదృష్టం! మమ్మల్ని మీరు జ్ఞాపకం వుంచుకున్నందుకు ఎంతో సంతోషం."

వెనుకవచ్చిన వృద్ధ స్త్రీలు, వికలాంగులు నెమ్మదిగా మంచంమీద కూర్చున్నారు. వాళ్ళ ముఖాలు సంతోషంగా వున్నాయి. బహుశా చాలారోజుల తరువాత వాళ్ళకిభోజనం తృప్తిగా దొరికే ఆశ కలిగింది యీరోజే నేమో! పటేలు ఓరగా చూచి, తన ఘనకార్యానికి వికటంగా నవ్వుతున్నాడు. నాయకునికికూడా నవ్వు వచ్చింది. తన మర్యాద దక్కినందుకు సంతోషపడినట్లు, అతని ముఖంలో కనిపిస్తోంది. చోదకుని ముఖం తారు పూసినట్లవడం ఆ కరదీపికల వెలుతురులో విస్పష్టంగా కనిపించింది.

పక్క గదిలో నుంచి పప్పు పులుసు తిరగ పోత ఘుమ ఘుమాయింపు వచ్చి యిల్లంతా చుట్టుకుంది.

# ప్రేమలాంఛనం

జి. యస్. యస్. ప్రసాద్

శారద తలుపు తెరచి నవ్వుతూవున్న రమేశ్‌ను చూచింది. శారద కాశ్చర్యం కల్గింది-రమేశ్ యిక్కడి కెలా వచ్చాడా అని. శారద అంది: "చాలా విచిత్రపు మనిషివి రమేశ్."

"నీకు ఒక సంతోష వార్త వినిపించుదామని వచ్చా. ఏమన్నా బహుమతీ యిస్తే చెప్తాను."

"అదేం కుదరదు. వినిపించితే వినిపించు. బహుమతులు శూన్యం."

"అయితే బహుమతి కూడా నేనే యివ్వాలన్నమాట. ముందు విషయం చెవుతా, తర్వాత బహుమతీ యిస్తా."

"ఆరు మాసముల క్రిందట నన్ను 'సిమెంట్ వర్క్స్'లో తీసుకున్నారు. ఆ తర్వాత నా పనికి సంతసించి యజమానులు వాటా యిచ్చారు. తర్వాత మా కంపెనీకి చాలా లాభం వచ్చింది. ఈ తక్కువ కాలంలోనే బాగా ధరలు పెరిగాయి. నేడు వాటిని 40 వేల కమ్మాను."

"నువ్వు చాలా అదృష్టవంతుడివి రమేశ్. మా..."

"శారదా! ధైర్యం వహించు. నీ అదృష్టం మంచిదే. ఆ బల్లమీ దేముందో చూడు."

శారద ఒక కాగితంతో ప్యాక్ చేసిన దాన్ని రమేశ్ కిచ్చింది. రమేశ్ తెరచాడు. మంచిగంధపు చెక్కతో చేయబడిన పెట్టెను తీశాడు. శారద ఆత్రుతతో "అందులో ఏముంది?" అని అడిగింది.

"నువ్వే చూడు" అంటూ శారద కిచ్చాడు. పెట్టెలో వజ్ర మిమిడ్చిన ఉంగర ముంది. ఉత్సాహంతో "యిది నాకేనా" అంది శారద.

"అవును. నీకే. నీకంటె యింకెవరు నాకు ఎక్కువప్రియమైనవాళ్లు?"

"పురుషులప్రేమకు అంతేమిటి? స్త్రీలు వాళ్ల ఆటబొమ్మలు" అంటూ నవ్వింది శారద.

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు.కాని వేళ్లన్నీ ఒకేవిధంగా వుండవుకదా!"

శారద వేలికి వుంగరం పెడుతూ"నీకు నచ్చిందా" అన్నాడు.

శారద వుంగరాన్ని చూసి, చాలా సేపు వజ్రాన్ని పరీక్షించింది. ముఖాకృతిలో సంతోష చిహ్నాలు రేకెత్తినై. కాని, ఎందువల్లో ఆక్షణమే ఉదాసీనత వ్యాపించింది.

"రమేశ్, దీని కిమ్మతెంత?"

"ఎందుకు, డబ్బిస్తావా?"

"కాదు, తెలుసుకుందామని."

"వజ్రం ఒక్కటే 15వందలు- బంగారం, మజూరీ కాక."

"అయితే నేను దీన్ని తీసుకోను."

"ఎందుకని?"

"ఇంత వెలగల వుంగరాన్ని చూసి నా భర్తకు సందేహం కలుగుతుంది. మన యిరువురి ప్రేమా ఎంతపవిత్రమైందయినా—— సందేహం కలుగుతుంది ఆయనగారికి." రమేశ్ తల గోక్కుంటూ- "శారదా! ఒక వుపాయం తట్టింది. దీన్ని నేనుకొన్న వర్తకునిదగ్గరకు తీసుకెళ్లి రేపటివరకు తనదగ్గరే వుంచమని చెపుతా. నువ్వు నీభర్తతో వెళ్లి దీన్ని తీసుకుంటానని చెప్పు. వర్తకుడుమాత్రం నకిలీరాయి అని 50 రూపాయలకే అమ్ముతాడు. ఈవిధంగా చేస్తే సమస్యాపరిష్కారమౌతుంది, ఏమంటావ్?"

రెండవరోజు శారద అలాగే చేసింది. ఉంగరం భర్తకు కూడా నచ్చింది. వర్తకుడు కూడా కాస్త నీళ్లు నమిలాడు. "దీని అసలు ఖరీదు 150/-రూపాయలు. కాని మొదట తీసుకొన్న స్త్రీ ఆర్థిక కష్టంవల్ల యేధరకైనా సరే యివ్వమని బ్రతిమాలింది నన్ను. మీరు చాలా భాగ్యవంతులు అందువల్లే మీకు యీ సమయం లభించింది. మీరు చేయించినా 125 రూపాయలకు తక్కువ కాదు. వాస్తవంగా నకలు రాయి అయినా అసలుదాన్నే నకలని పించుతుంది. మంచిమంచి వ్యాపారస్థులు కూడా మోసపోతుంటారు."

శారదభర్త 45 రూపాయలు యివ్వదలచాడు. వర్తకుడు 50 రూపాయలకు తప్పిగవ్వ కూడా తగ్గనన్నాడు. శారద భర్తవంక జాలిగా చూసింది. స్త్రీ కోర్కెను ఏ పురుషుడు వుంగవుడుం కాదనగలడు!

బేరం పూర్తయింది. వర్తకుడు వుంగరాన్ని అందమైన పెట్టెలో పెట్టి పాక్ చేశాడు. శారద భర్త పాకెట్ జేబులో వేసుకుంటూ "నువ్వు యింటికి కద. ఎంగ్రేవర్ వద్ద కెళ్ళి మన యిద్దరి పేర్లూ చెక్కించుకొస్తా" నన్నాడు.

ఒకగంట తర్వాత శారదభర్త తిరిగివచ్చాడు. శారద పరుగెత్తుకుంటూ వెళ్లి తలుపు తీసింది. భర్త చాలా సంతోషంగా వున్నాడు. "నేడు చాలా సంతోషంగా వున్నారు, కారణం?" అని అడిగింది.

"గుడ్డలు మార్చనియ్. అంతా చెపుతా. మన అదృష్టం మళ్లింది."

ఈ మాట అనటంతోటే శారదకు యీ పెద్దమనిషి వుంగర మమ్మి రాలేదుగదా అని అనుమానం కలిగింది. "ఉంగరంమీద పేర్లు చెక్కించారా?" అంది.

"కాస్త ఆగు, అంతా చెప్తా."

శారద హృదయం దడదడ కొట్టుకోసాగింది.

"ఆఁ, నేను ఎంగ్రేవర్ వద్ద కెళ్లేసరికి అక్కడో వర్తకుడు కూర్చుని వున్నాడు. వుంగరాన్ని చూసి ఎంతకు తీసుకున్నారని అన్నాడు. వంద రూపాయలని చెప్పాను. రెండువంద లిస్తాను, అమ్ముతారా? అన్నాడతను. బోల్తాకొట్టా డనుకున్నా. నకిలీ వస్తువును చూసి మోసపోయాడు. అందుకని 500 రూపాయ లన్నా గట్టిగా. మళ్ళీ ఉంగరాన్ని తీసుకుని చూసి, అమ్ముతారా అన్నాడు. తీసుకొన్నదైతే నాకోరకే, కాని మీకునచ్చితే 500 రూపాయల కిస్తానన్నాను. వెంటనే అతను అయిదు వందల రూపాయల నోట్లు తీసి యిచ్చాడు.

"ఇవిగో-యిందులో 50 నీవి, 450 రూపాయలు నావి. నువ్వెప్పుడూ నన్నర్థం చేసుకోవు. అర్థం చేసుకోకుండానే పట్టి దద్దమ్మ నను కుంటావ్."

(ఆంగ్లకథ కనుసరణ)